# చలమయ్య

డి. హైమవతీ రామకృష్ణ

మనిషి అన్న తరువాత ఎన్నో కోరికలు ఉంటాయి. అన్నీ కాకపోతే కొన్ని అయినా నెరవేరడం అనేది కొలదిమంది అదృష్టవంతుల విషయం లోనే. అలాంటప్పుడు అసంతృప్తి ఏర్పడడం సహజం.

**ఆ సాయంత్రం** ఆలస్యంగా వచ్చాను. కాస్త కాలం గడుపుదామని పార్కుకుపోతే నలుగురు చేరి నానాజాతులు గురించీ మాట్లాడుతూ కాలం మర్చిపోయాను. ఇంట్లో అడుగు పెట్టగానే ఎవరో వచ్చారని చెప్పింది శ్రీమతి. నాకు ఒక్కసారిగా ఆశ్చర్యం కలిగింది. నాకోసం ఎవరు వచ్చారా అనుకున్నాను. పైగా విశేషమేమంటే ఎవరో మనకోసం వచ్చిపోయారని చెబితే, ఆ వచ్చిన వ్యక్తి అక్కడలేకపోతే, మనస్సు మరీ వేదన పడుతుంది. ఎవరైనా బంధువులైతే ముందుగా వ్రాయకుండా రారు. పోనీ, వ్రాయకుండా వచ్చినా మా ఆవిడకు తెలుసుగా?



**నెలకు రూ. 200 సంపాదించండి**

డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ గైడ్ ఫ్రీ హాండ్ డ్రాయింగ్, స్టెన్సిల్, కలర్ స్కీముతో పెయింటింగ్ వర్కు నేర్చుకోడానికి 352 బొమ్మలతో పూర్తి గైడు ధర రు. 6—దీనితో మీరు మంచి డ్రాఫ్ట్స్మన్, డ్రాయింగు మాస్టరు, పెయింటరు డిజైనరు, ఆర్టిస్టు కావచ్చును. ఎంబ్రాయిడరీ డిజైను బుక్కు 250 డిజైనులతో ధర రు. 5—

ILFA BOOK DEPOT (PT. 3)
Rafahganj, Aligarh (U.P.).

**అప్పు తీసుకోండి**

రు. 250/—నుంచి రు. 10,000/—

పెండ్లికి, వ్యాపారమునకు, ఇంటికి, కారుకు, మ్యోటరు వగైరాలకు స్వంతపూచీమీద ఋణం తీసుకోనండి. సులభమైన నెలసరి వాయిదాలలో తీర్చవచ్చును. ప్రాస్పెక్టస్ ఉచితం. ఇంగ్లీషులోగాని, హిందీలోగాని వ్రాయండి.

KUBER FINANCE (P) LTD.,
(K—65) Amritsar-5.

# చలమయ్యా

ఎటొచ్చీ—

"ఏమిటే! పైగా మనకోసం ఎవరబ్బా వస్తే?" అన్నాను.

"నాకేంతెలుసు? ఎవరో! 50 ఏళ్ళు ఉంటాయి. సంచి యిక్కడ పెట్టి మళ్ళా వస్తానమ్మా అన్నాడు. నాకు తెలిసిన బంధువు లలో ఎవరూకాదు. పైగా నేను అన్ని వివరాలు అడగలేదు, నా కెందుకులే అని."

మరలా వస్తానన్నాడు కదాఅని, ఎవరబ్బా అని నామనస్సు అన్వేషణ ప్రారంభించింది. ముఖం తెలియని పరాయివాడయితే సంచి యింట్లో పెట్టి మరలా వస్తానంటాడా? ఎవరో తెలిసినవాడై ఉండాలి. అయినా చూద్దాం, రాకపోడుగా అనుకున్నాను. కాని మనస్సు ఆగితేనా? ఎప్పుడు వస్తాడో ఏమో? పోనీ సంచి దగ్గరకు వెళ్ళి చూస్తే ఏమైనా వివరాలు దొరకకపోతాయా? చా! బయట వాళ్ళ సంచిదగ్గరకు వెళ్ళడం తప్పుకదూ? పైగా ఆ సంచిలో ఏమున్నాయో? ఏమో? పోయినవాడు రాకపోడుగా అనుకున్నాను. అయినా ఆ సంచి చూస్తే తెలుస్తుంది అతని పరిస్థితి. వచ్చినవాడు ఏ హోదా కలవాడో? సరే అని టేబుల్ దగ్గర ఉన్న ఆసంచి దగ్గరకు వెళ్ళాను. ఆసంచి పైన ఒక మ్యాన్ పేపరు ఉంది. బయటికి తీసి చూసేసరికి దానిపైన నాకు ఆశ్చర్యం కలిగించే ఒక పేరు ఉంది. 'అరే! ఇంతకీ చలమయ్యా వచ్చింది!' అనుకున్నాను. ఏదో నాకు పోయిన వస్తువు దొరికినట్లయింది.

"ఏమోయ్! రా!రా! వచ్చింది ఇంతకీ ఎవరో తెలుసా"అన్నాను. కాని దానికేం తెలుస్తుంది? ఎవరో అన్నట్లు చూసింది.

"ఇంతకీఈపేరు ఎప్పుడైనా విన్నావా లేదా?" అన్నాను.

"ఎవరండీఆయన?అంత తత్తరపాటెందుకూ, ఎవరో చెప్పక" అంది.

"చలమయ్యే! చలమయ్య, నా చలమయ్య, నిజంగా మాట్లాడితే మన చలమయ్య కూడానూ! ఇంతకీ వీడికి బుద్ధి ఉందా లేదా అంట? ఒక్క ఉత్తరం ముక్క అయినా వ్రాయకుండా ఆకాశం మీదనుంచి ఊడినట్లు పడ్డాడేమిటే? మొదటినుంచీ వాడు గడుగ్గాయే. ఈరోజున ఒక్కసారే ఎట్లా మారుతాడులే? ఇంతకీ, కాళ్ళకు నీళ్ళయినా యిచ్చావా?"

"నాకేంతెలుసండీ అతనెవరో? ఇప్పుడు మీరు చెబుతూ ఉన్నా తెలియదు ఆ చలమయ్య ఎవరో."

నాకు ఒక్కసారిగా చెప్పలేని ఆనందం కలిగింది. 'చలమయ్యా! అబ్బా ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి!' ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో కూడా సరిగ్గా తెలియదు. బహుశా ఎప్పుడో రెండు మూడేండ్లనాడు బెజవాడ స్టేషనులో అకస్మాత్తుగా కనపడ్డాడు. "ఏరా చలమయ్యా? గుర్తు ఉన్నానా" అని అన్నాను అప్పుడు. "నీవట్రా, వీరభద్రం? ఎంత మారిపోయావు?" అని నన్ను కౌగలించుకొన్నాడు. ఎక్కువగా మాట్లాడ టానికి అప్పుడు టయిము లేదు. వాడు కొండ పల్లి ఎక్స్కర్షన్‌కని స్కూలు పిల్లలను తీసుకొని వెళ్తూ ఉన్నాడు. "ఒరే! ఒక్క ఉత్తరం ముక్క రాయురా" అన్నాను."ఉత్తరమటరా!మనకెప్పుడూ అలవాటు లేదే! అయినా అడిగావుగా!తప్పక వ్రాస్తానులే!" అన్నాడేకాని అలవాటు లేని పని వాడు చేస్తాడూ!

నాకు చలమయ్యను చూడాలని ఇప్పుడెంతో ఉత్సాహంగా ఉన్నది. తలుపులు తీసి బజార్లోకి చూశాను, వస్తున్నాడేమోనని. కానిరాండే? ఎంతసేపు చూసినా రాడు. అలాగే వచ్చి పడక కుర్చీలో కూర్చొని ఎదురు చూస్తూ ఉన్నాను. కొబ్బరిచెట్ల ఆకులు విసరుతున్న గాలి చల్లగా ఒంటికి తగులుతున్నది. ప్రక్కనున్న సన్న జాజిపొదనుంచి సువాసన ముక్కుకు సూటిగా తగిలింది. మనస్సు చలమయ్య మీదికి పరు గెత్తింది. సన్నని కొబ్బరి ఆకుల సందుల నుండి చూస్తూన్న నాకు గత జీవితం కళ్ళముందు

రోజల్లా కష్టించి పని చేశాక వినోద కాలక్షేపానికి సిద్ధమేనా

కాదా? అయితే సానటోజన్ సేవించండి. 95% పాల సత్తువ గలిగి 8 విటమినులతో బలపర్చబడిన బలవర్ధకౌషధము (టానిక్) ఇది ఒక్కటే. సానటోజన్ శరీరప్రకృతిని శక్తివంతంగా ఉత్తేజపరచి, శారీరక మరియు మానసిక జవశక్తులను వృద్ధిపరచ పురికొల్పును.

సానటోజన్ ఆరోగ్యమునకు జవ శక్తులకు అధికసత్తువగల బలవర్ధకౌషధము (టానిక్)




# సానటోజన్

## అధికసత్తువగల బలవర్ధక టానిక్

GR. S. 54 TEL.

తారట్లాడింది.

* * * *

చాలాకాలంనాటి మాట. స్కూలులో చదువుతున్న రోజుల్లో ఒక అబ్బాయి అనుకోనని సంఘటన ద్వారా నాకు స్నేహితుడయ్యాడు. అది చాలా విచిత్రమైన సంఘటనే. ఒకసారి నేను ఫుట్‌బాల్ ఆడుతూఉంటే చేతిఉంగరం జారిపోయింది. ఎక్కడపడిందో తెలియక భయపడి ఏడుస్తూ ఉంటే ఆ అబ్బాయే ఉంగరం తీసుకొని వచ్చి "ఇదేనా మీ ఉంగరం?" అన్నాడు. నాకుపోయిన ప్రపంచం దొరికినట్లయి ఉంగరం తీసుకొని ఆ అబ్బాయిని కౌగలించుకొన్నాను. ఎంత నిజాయితీ పరుడా అబ్బాయి! విలువైన వస్తువు దొరికినా ఆశించక తిరిగి యిచ్చేశాడు.

అప్పటినుంచి అతనితో స్నేహం చేయాలనిపించింది. "ఏం పేరు" అన్నాను. "చలమయ్య" అన్నాడు. "మా ఇంటికి వస్తావా?" అన్నాను. మా యింటికి తీసుకొనివెళ్ళి జరిగిన సంగతంతా అమ్మా, నాన్నకు చెప్పేసరికి వారు చలమయ్యను ఎంతో పొగిడారు. ఆ విధంగా కలిసింది నాస్నేహం చలమయ్యతో. ఇద్దరం "అరే" అనుకునేవారం.

పాపం! చలమయ్య చాలా బీదవాడు. తల్లీ, తండ్రీలేరు. ముసలి మేనత్త పోషణలోఉండేవాడు. ఎప్పుడూ మాయింట్లోనే ఉండేవాడు. ఇద్దరం కలిసి చదువుకునేవారం. స్కూలు ఫైనల్‌దాకా అక్కడే చదివాము. చలమయ్య చాలా చురుకైనవాడేకాక మంచి మాటకారి కూడా! ఎంత ఆముదం తాగిన వారినైనా ఇట్టే నవ్వించగలడు. ఒకనాడు తరగతిలో "ముందు జీవితంలో ఎవరికి ఏం కావాలని ఉంది?" అని అడిగారు టీచరు. "నేను కలెక్టరుని అవ్వాలని ఉంది" అన్నాను నేను. మన చలమయ్య అన్నాడు గదా: "మాస్టారూ! అనుకున్నట్లు అవుతామటండీ! నాకు రాజు కావాలని ఉంటే అవుతానా చెప్పండి! నాకు ఏమి ఆవాలనీ లేదు" అన్నాడు. వాడి వేదాంతానికి నాకు నవ్వు, విచారం కల్గాయి. ఇద్దరం ఫైనల్ ప్యాస్ అయ్యాం. "ఏరా చలం, కాలేజీలో చేరవా?" అన్నాను. "ఏరా భద్రం, నాతో సరస మాడుతావట్రా? నేను ఏం కాలేజీలో చేరుతారా? వక్కఎక్కడ? నాగలోకమెక్కడ? నీవు మాత్రం చదివి కలెక్టరు అవ్వవోయ్! అదే నాకు కావాలి. నీవు చదివితే నేనూ చదివినట్లే లెక్క" అన్నాడు చలమయ్య అంత తేలికగా తీసుకుంటాడు ఏ విషయమైనా? ప్రపంచమన్నా, బీదరికమన్నా, జీవితమన్నా వాడికసలు సమస్యలాగే కనుపించదు.

ఎప్పుడూ ఏదో నిస్సహాయస్థితిలో ఉన్నప్పటికీ విసుగూ విరామమూ మాత్రం లేదు. అనేవాడు కదా—"ఒరేయ్ భద్రం! నాకేం కావాలి చెప్పు. ఏదో ముసలి మేనత్త దయవల్ల ఇంతవరకు చదివాను. ఏదో కాస్తంత ఉద్యోగం దొరకదా పొట్ట పోసుకోడానికి?" నిజమే, వాడి పరిస్థితి వాడిది. ఎన్ని తెలివి తేటలుంటే ఏమిలాభం? ఎడారిలో పువ్వులానే కదా! కాని చలమయ్యలో ఒక విశేషముంది. ఒకరిని ప్రాధేయపడటం కాని, సహాయం చెయ్యమని అడగటంగాని లేదు. అది అతని అహంభావమంటే అతనిని అర్థం చేసుకోలేదన్నమాట.

నేను ఇంటర్ చదివే రోజుల్లో కూడా చలమయ్యతో పరిచయమేమీ తగ్గలేదు. కొన్నాళ్ళు ఏమీ ఉద్యోగం లేక చాలా అవస్థపడ్డాడు. చివరకు బట్టల దుకాణంలో గుమాస్తాగా చేరాడు. కానీ అప్పుడే జరిగింది ఒక విచారకరమైన విషయం. బట్టల దుకాణంలో రెండువేలు గల్లంతైనవి. ఆనేరం పాపం! చలమయ్య మీద పడింది. వెంటనే పోలీసులకు పట్టించారు. నాకీ విషయం తెలిసి ఎంతో విచారించాను. చలమయ్య అలాటివాడు కాదు. నాకు తెలుసు. ఆ సందర్భంలో నేను చలమయ్యను కలిశాను. కాని చలమయ్య మామూలుగానే ఉన్నాడు. దుఃఖంగానీ, నేరం పడిందన్న ఒరువుగానీ, ఏకోశానా లేదు. "ఏమిట్రా ఈ ఘోరం!" అని అడిగాను. చలమయ్య నవ్వుతూ అన్నాడు: "ఒరే భద్రం! ఘోరమేముంది? నా నిజాయితీ నాకు తెలుసు. ఎవరేమనుకున్నా నాకు ఫర్వాలేదు. నాకు అట్టే బెంగలేదనుకో. కాని విచిత్రమేమంటే ఈ ప్రపంచంలో మంచికి స్థానం లేదురా." చలమయ్య ఎంతో సంతోషంగా పైకి ఉన్నప్పటికీ అతని నిస్పృహమాత్రం అతని వాలకంలో కనిపించుతూనే ఉన్నది.

నిజం నిలకడమీదే తెలుస్తుందంటూరు. అదే జరిగింది చలమయ్య విషయంలో. డబ్బు కైంకర్యం చేసిన అసలు గుమాస్తా చిక్కటం, చలమయ్య నిజాయితీ ఒక్కసారి బయటపడినాయి. నిజం చెప్పాలంటే చలమయ్య నిప్పు వంటి మనిషి. కాని నిప్పువలె ప్రకాశించలేకపోయాడు జీవితంలో. తరువాత ఇంటర్‌చదవమని ప్రోత్సహించాను. కాని చలమయ్య ఎలా చదవగలడు? చదటానికి డబ్బుగాని, సావకాశం గాని లేకపోయాయి. చివరికి తాడులేని బొంగరంలా రెండు మూడేళ్ళపాటు తిరిగాడు. ఎక్కడున్నా రెండు నెలలకంటే వెలగబెట్టడు ఉద్యోగం. చివరకు ఎట్లో టీచరు ట్రెయినింగ్ చదివాడు. మా ఊరులోనే కొన్నాళ్ళు టీచరుగా చేశాడు. అప్పటికి నాకు బి. ఎ. అయిపోయింది. నేనూ, చలమయ్యా తరుచూ కలుస్తుండేవాళ్ళం. కన్పించినప్పుడల్లా నన్ను "కాబోయే కలెక్టరు గారూ!" అని పిలిచేవాడు. స్కూల్లో టీచరుగా పనిచేస్తూ ఉన్న రోజుల్లోనే చలమయ్య జీవితాన్ని మార్చిన ఒక సంఘటన జరిగింది. ఆ ఆస్కూలులోనే పనిచేసే మేరీ అనే ఒక ఉపాధ్యాయినిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కాని విశేషమేమంటే ఈ విషయం ఎవరికీ తెలియదు. చివరకు నాకు కూడా.


గప్పున పొగలా లేచింది ఊరంతా చలమయ్య పెళ్ళివార్త. నాకు కాస్త బాధవేసింది. పెళ్ళి చేసుకొనడంలో తప్పులేదు. కాని, కులం

పండిత
డి. గోపాలాచార్యులవారి
అరుణ
స్త్రీల ఆరోగ్యసౌభాగ్యాలకు
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు-17

మీరు నిద్రించునప్పుడు
ఉబ్బసపు తెమడను
సడలించును
ఊపిరి బిగదీయుట, దగ్గు, శ్లేష్మము, గొంతు నొప్పి, ఉబ్బసము, రొమ్ము పడిశము, జలుబు మరియు తాపజ్వరము మొదలగు వ్యాధులతో బాధపడు వేలకొలది రోగులు యిక వీటికి భయపడనవసరములేదు. అమెరికా దేశపు ఆధునిక ఔషధములతో శాస్త్రోక్తముగా తయారైన ఈమందు, గుండె, ముక్కు మొదలగు భాగములకు రక్తముద్వారా వ్యాపించి శ్లేష్మమును హరించును. మీకు వెంటనే ఊపిరి బాగుగావచ్చును, దగ్గు శ్లేష్మము తగ్గి పసిబిడ్డవలె నిద్రించగలరు. పూర్తిగా తృప్తి నిచ్చుటకు గ్యారంటీ యివ్వబడిన మెండకో (MENDACO)ను మీ కెమిస్టువద్ద కొనండి.

మంచి రహస్యం
గ్లోరియా ద్రవాన్ని, మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును, ముఖంలో ముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చుటు ఎండకువచ్చే నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును
వెల రూ 1-75. అన్ని షాపుల్లో దొరుకును
JANITA PRODUCTS, ELURU. A.P

మంచి పుస్తకాలు
జీవిత రహస్యాలు – మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు – - రూ 3-50
యువతి – స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు రూ 3-50
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు రూ 3-50
ఉమ్మక రహస్యాలు - వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు రూ 6-00
ఉద్యోగదర్శిని – మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ 5-00
ఆత్మజ్ఞానము – శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు రూ 2-50
పోష్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి.పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును
దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర



పంకజం

ఫోటో—డి. ఆర్. ప్రసాద్ (విజయవాడ-2)

దాటి, మతం దాటి చేసుకున్నందుకు చలమయ్య దుమారానికి గురి అయ్యాడు. చలమయ్య చేసిన దాంట్లో తప్పేముంది? అతని ఆశయాలు అతని జీవిత విధానం తెలిసిన నాకు అట్టే ఆశ్చర్యం కలుగలేదు.

పెళ్ళి అయిన తరువాత చలమయ్య ఆ ఊరు వదిలివేశాడు. ఎక్కడో గోదావరి జిల్లాలో టీచరుగా చేస్తూ ఉన్నాడు. పరిస్థితులవల్ల చలమయ్య నాకు దూరమౌతూ ఉన్నప్పటికీ, చలమయ్య మంచితనాన్ని, స్నేహాన్ని మరువలేకున్నాను. చాలాసార్లు ఉత్తరాలు వ్రాసేవాడిని కాని చలమయ్యలో ఉన్న మహాదుర్గుణం అసలు జవాబు వ్రాయకపోవడం. చాలాకాలానికి తరువాత ఒక దుఃఖవార్త తెలుపుతూ ఒక ఉత్తరం వ్రాశాడు తన భార్య అకస్మాత్తుగా చనిపోయిందని. ఆవార్త నన్ను కదిలించి వేసింది. ప్రత్యేకంగా చలమయ్యను కలుసుకోడానికి అతనివూరు వెళ్ళాను. చలమయ్య చిరునవ్వుతో స్వాగత మిచ్చాడు. ఒకేనవ్వు, ఒకే ముఖం, ఒకే సంతోషం. ఎట్టి చలనమూ లేని చలమయ్య నిజంగా నాకు ఒక వింతమనిషిలాగున్నాడు.

భార్య పోవడాన్ని గురించి నేను చాలా విచారం తెలియ పరిచాను. కాని చలమయ్య గుండెనిండయినది. "భద్రం, బ్రహ్మాండం బ్రద్ధలైనా అట్టే పట్టించుకోనబ్బాయ్! నా మేరీ పోయిందంటే నాకు విచారమే లేదు. ఎందుకంటే అది ప్రకృతిలో ఉన్న సత్యమే. ఎంత సంపాదించినా, ఎంత ఉద్యోగం చేసినా, ఎన్ని ఘన కార్యాలు చేసినా చావును ఎవరూ తప్పించుకోలేరుకదా! ఆమాటకొస్తే నీవు, నేను కూడా ఎప్పుడో ఒకప్పుడు..."

చలమయ్య మేరుధీరుడు. ఎన్ని వడగాల్పులకైనా చెక్కు చెదరని నిండైన చెట్టువంటి వాడు. కాలచక్రం తిరుగుతూంటే పరిస్థితులు పరిభ్రమిస్తూంటేమనుష్యులుదూరమౌతూంటే చలమయ్య ఇంకా నాస్మృతిపథంలోనే ఉన్నాడు. ఇదంతా జరిగిపోయినకాలంనాటి దృశ్యం.

ఇప్పుడు చలమయ్య ఎట్లున్నాడో!...

నేను మెల్లగా తలఎత్తి వీధి చివరకు చూచాను. చలమయ్య వస్తూ ఉన్నాడు.

## చలమయ్య

అదేనడక, అదేముఖం, అదేమనిషి, నేను ఒక్కసారిగా నిలబడి, "ఒరే! చలమయ్యా రారా!! నాకళ్ళు కాయలు కాస్తూ ఉన్నాయి" అన్నాను. "ఒరేయ్ భద్రం! ఇంకా నేను గుర్తు ఉన్నానట్రా! అసలు గుర్తుంటానోలేదోనని భయపడ్డాను. కాలంతోపాటూ నీవూ మారతావనుకున్నాను" అంటూ చలమయ్య వచ్చి కూర్చున్నాడు.

వాడిని నేను దీర్ఘంగా పరిశీలించాను. చలమయ్యలో మార్పు లేదు. ఏమైనా మార్పు ఉంటే అది వయస్సు ద్వారా వచ్చిన వృద్ధాప్యమే. వాడి కళ్ళల్లోని వెలుగు ఏమాత్రమూ తగ్గలేదు. కానీ జుట్టు కాస్త వూడి బట్టతల ప్రారంభించింది. నే నావిధంగా చూస్తూ ఉంటే చలమయ్య అన్నాడుగదా: "ఏంరా బాబ్యూవింగేశేలా చూస్తూవున్నావు? నేనే చలమయ్యనే!" కాని వాడిని చూస్తూ ఉంటే ఎంతచూసినా తనివి తీరటం లేదు. ఏమిటో తీరని అసంతృప్తి నాలో కలుగుతున్నది.

"చలం, ఎన్నాళ్ళయింది మనం కలసి? నాతో కలవకపోయినా ఎప్పుడైనా ఒక ఉత్తరమైనా వేయవేం? అయితే ఇంతకీ అక్కడే ఉంటూ ఉన్నావా? నీ మేరీకి పుట్టినపిల్ల పెద్దదయిందా?"

"ఒరేయ్ భద్రం, నేనిక్కడకు రావడమే ఒక అనుకోని సంఘటన. చాలా అకస్మాత్తుగా వచ్చాననుకో. ఇక్కడ ఉంటున్నావని, తప్పక కలుసుకొని పోదామని వచ్చాను. ఆ అమ్మాయి ఉంది చూచావూ, సుజాత అని పేరు పెట్టాను. ఇక్కడ నర్సుగా ట్రెయినింగ్ పొందటానికి చేర్పించాను."

"ఆఁ! ఏమిటీ! ఈవూరులోనే మీ అమ్మాయి ట్రెయినింగు తీసుకొంటూ ఉన్నదా? కాస్త కార్డుముక్కయినా వ్రాయకపోయావేంరా?"

"వ్రాయటాని కిదేమైన ఘన కార్యమట్రా భద్రం! అసలు విషయం చెపుతా విను. నర్సుగా చదువుతూ ఉన్న మా సుజాత ఇక్కడ ఒక హౌస్ సర్జను ప్రేమించింది. పెళ్ళి చేసుకుంటామనినిర్ణయించారు. ఆ విషయం నాకు అతడు వ్రాశాడు కూడా."

"అయితే నీ ఉద్దేశ్యమేమిటి?"

"నా ఉద్దేశ్యాని కేముందోయ్! పెళ్ళి విషయంలో ఎవరి యిష్టంవారిది. అందుకనే నేను ఏమీ జోక్యం చేసుకోలేదు. కానీ, చివరకు జరిగిందేమిటంటే, ఆ డాక్టరు తల్లితండ్రులు పిల్లవాడిని బలవంతాన తీసుకువెళ్ళి తిరిగి రానివ్వకుండా వెంటనే పెళ్ళికూడా చేసినట్లు తెలిసింది. ఇదీ విషాదపు కథ! సుజాతను ఓదార్చటానికని వచ్చాను. ఎవరయినా ఏమి చేయగలరు? పెళ్ళీ, ప్రేమా రెండూ వేరు. ఈ సంఘటనే నన్నిక్కడకు తీసికొని వచ్చింది. చూడవోయ్, భద్రం, ఈ సంఘటనలో ఏదైనా మార్పుఉందంటావా! మార్పు వస్తుందన్న నమ్మకం నాకు ఏకోశానా లేదు."

"అయితే! ఇంతకూ సుజాత గతేమిటి?" అన్నాను నేను.

"ఏమిటయ్యే దేమిట్రా! నర్సుట్రెయినింగ్ పొందుతూ ఉంది. నర్సుగానే జీవిస్తుంది. నేనూ అదే చెప్పొచ్చాను. ఈ విషయం విన్నా నాకు అట్టే బాధ కలుగలేదనుకో. కారణమేమంటే ఇది అసహజమేమీ కాదు."

చలమయ్య ధీరత్వానికి నాకే ఆశ్చర్యం కలిగింది.

వింగి విరిగి మీదపడినా కదలడు, మెదలడు చలమయ్య.

"ఒరేయ్! నీవురా మనిషివంటే! ఎట్టి గట్టి విషయమైనా ఎంత తేలికగానో కొట్టి పారేస్తావు. సరే. రాకరాకవచ్చావు. నాల్గు రోజులుండి పోవాలిరా."

చలమయ్య చిరునవ్వు నవ్వాడు.

"థాంక్సు! నాల్గు రోజులు కాదుకదా! నాల్గు నెలలయినా ఉందును, నీవు నిజంగా కలెక్టరయి వుంటే." "అబ్బాయ్! నీవు ఏమీ అనుకోకపోతే ఒక్కమాట చెబుతా విను. స్కూల్లో చదివే రోజుల్లో నేను కలెక్టరవుతానని నీవు అన్నావు. కాని, చివరకు అయిందేమిటి? లెక్చరర్ని!"

"మనం అనుకున్నవన్నీ నిజమయితే గుడిసెలు గోపురాలు కావటోయ్, భద్రం! ఈ రాత్రికి మాత్రం ఉంటాను. తెల్లవారి పోతాను."

ఆరాత్రి చలమయ్య నాతో గడిపాడు. బంధువు కాని బంధువు, నా బాల్య మిత్రుడు చలమయ్య. తెల్లవారేసరికి సంచి తీసుకొని ప్రయాణమయ్యాడు.

"ఒరేయ్! నాల్గు రోజులుండరా" అన్నాను.

ససేమిరా ఉండనని బయలుదేరాడు. మా యిద్దరి కన్నుల్లో నీరుమాత్రం సన్నగా జారింది. అప్పుడే ప్రకాశిస్తూన్న సూర్య కిరణాలలోకలసి పోతూ ఉన్న చలమయ్యను కొబ్బరి చెట్ల సందుల్లోంచి చూస్తూ ఉంటే ఆ విచిత్రమైన వ్యక్తి నాకు దూరమౌతూన్న కొద్దీ బాధ అధికమయింది. ★